www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 20 నవంబరు 2022
5
పశ్చిమ గోదావరి

విద్యార్థుల సంక్షేమం గాలికి..

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు

నరసాపురం: ప్రభుత్వం హాస్టల్లో విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ హాస్టళ్లను ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ 2018లో ఉన్న ధరలకు అనుగుణంగా 2022లో చెల్లించడం దారుణమన్నారు. హాస్టల్లో వర్కర్లను నియమించలేదని, ఆ పని ఎవరు చేయాలని ప్రశ్నించారు. వర్కర్లను నియమించకపోవడం వారిపట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకుని పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎండి.జాన్, కృష్ణ నాయకులు, పవన్ కళ్యాణ్ పి.సాయి పాల్గొన్నారు.

21న భారీ ప్రాజెక్టు పనులకు సిఎం శ్రీకారం

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జిల్లాలో ఏకైక తీరప్రాంతం, నరసాపురం నియోజకవర్గ చరిత్రలో పెండిగ్‌లో ఉన్న నూతన భారీ ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ నెల 21వ తేదీ సోమవారం శ్రీకారం చుట్టనున్నారని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు.సత్యనారాయణ అన్నారు. శనివారం నరసాపురం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాద రాజు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవి ప్రకాష్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. నరసాపురం 31వ వార్డు చిన మామిడిపల్లి లేఅవుట్‌లో హెలీప్యాడ్‌ను, 25వ వార్డు నక్కా వారిపేట వీవర్స్ కాలనీ సభాస్థల వేదికను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు

విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్య మంత్రి ఈ నెల 21వ తేదీన నరసాపురం రానున్నారని, ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లూ పూర్తవుతున్నాయని తెలిపారు. రూ.429.43 కోట్లతో వేములదీవి హార్బర్, కార్గో పోర్టు, రూ.1400 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్, రూ.332 కోట్లతో సరిపల్లిలో ఆక్వా యూనివర్సిటీ అండ్ నాలెడ్జి పార్క్ నిర్మాణం, రూ.133 కోట్లతో రుస్తుంబాదలో 220/132/30 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. రూ.61.81 కోట్లతో మున్సిపల్ వాటర్ ప్రాజెక్టు, రూ.87 కోట్లతో నరసాపురం మున్సిపాల్టీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (పేజ్-1) నిర్మాణం, రూ.180.5 కోట్లతో మొళ్లపర్రు అండ్ ఉప్పుటేరుపై రెగ్యులేటర్, బ్రిడ్జి, లాక్ నిర్మాణం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. రూ.13 కోట్లతో 100 పడకల ప్రభుత్వాసుపత్రి, రూ.4.80 కోట్లతో ఆధునికీకరించిన ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. దర్బరేవు పెదలంక భూములు నిరుపేదలకు పంపిణీ, రూ.31 కోట్లతో వియర్ ఛానల్, శేషావతారం ఛానల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెసి జెవి.మురళి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, అధికారులు పాల్గొన్నారు.

రేపు ముఖ్యమంత్రి పర్యటన సాగేదిలా

ప్రజాశక్తి - నరసాపురం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 21వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరి హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుండి 10.10 గంటలకు బయలుదేరి 10:50 గంటలకు నరసాపురం చేరుకుంటారు. 10:55 నుండి 11:05 వరకూ ప్రజా ప్రతినిధులతో మమేకమవుతారు. 11:05 గంటలకు నరసాపురం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి బహిరంగ సభాస్థలికి 11:15 గంటలకు చేరుకుంటారు. సభ అనంతరం 12:50కు బయల్దేరి 12:55 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు 12:55 నుండి 1:10 గంటల వరకు స్థానిక నేతలతో సంభాషిస్తారు 1:10 గంటలకు నరసాపురం నుండి హెలీకాప్టర్లో బయలుదేరి 1:55 కు తాడేపల్లి చేరుకుంటారు.

సౌకర్యాల కల్పనలో అలసత్వం వద్దు

దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ జాన్‌ప్రసాద్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

రైల్వే స్టేషన్లలో ప్రయా ణికులకు సౌకర్యాలను కల్పించడంలో అలసత్వం వహించరాదని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జి.జాన్‌ప్రసాద్ రైల్వే అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక నరసాపురం రైల్వే స్టేషన్‌ను ఆయన సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. టిటిఇ రెస్ట్ రూమ్, టికెట్ బుకింగ్ ఆఫీస్, సర్క్యూలేటింగ్ ఏరియా, క్యాటరింగ్ స్టాల్స్, పార్సిల్ ఆఫీస్‌లను పరిశీలించి, సదుపాయాల గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న బ్రాంచ్ లైన్ డబ్లింగ్, స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. యుటిఎస్ యాప్ ద్వారా టికెట్ కొనుగోలు వాటాను పెంచాలని పిసిసిఎం అధికారులకు సూచించారు. ఆయన వెంట సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ పి.శివప్రసాద్, నరసాపురం రైల్వేస్టేషన్ మాస్టర్ దివాకర్, పాలకొల్లు రైల్వేస్టేషన్ మాస్టర్ టి.రామలింగేశ్వరరావు, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ నాగేశ్వరరావు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న జాన్ ప్రసాద్

పాలకొల్లు : సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ జి.జాన్‌ప్రసాద్ శనివారం పాలకొల్లు రైల్వే స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎసిఎం వి.రవివర్మ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం ప్రయాణీకుల సౌకర్యాలను సమీక్షించారు. బుకింగ్ ఆఫీస్, క్యాటరింగ్ స్టాల్స్, పార్శిల్ ఆఫీసులను పరిశీలించారు. యుటిఎస్ యాప్ ద్వారా టికెట్ కొనుగోలు వాటాను పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పి.శివ ప్రసాద్, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, పాలకొల్లు స్టేషన్ మాస్టార్ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి - పెంటపాడు

రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యాన యానాలపల్లిలోని రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. ధాన్యం చేతికొచ్చి పది రోజులైనా ప్రభుత్వం ధాన్యం తరలించడంలో మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. ఓ పక్క ఆకాశం మేఘావృత మవుతోందని, చినుకులు పడితే ఆరబెట్టిన ధాన్యం కూడా తడిసిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. 65 సారలు మించి దిగుబడి వచ్చిన ధాన్యం తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 75 సరాలకు అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మరపట్ల దానయ్య మాట్లాడారు. పెనగంటి దుర్గ, మాదా శ్రీను, తాడి రాంబాబు, తాడి సుబ్బయ్య పాల్గొన్నారు.



నినదిస్తున్న రైతులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం: పివిఎల్

ఉండి: గ్రామంలో పర్యటించి సమస్యలను తక్షణం పరిష్కరించడమే గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ముఖ్యోద్దేశమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. శనివారంకలిసిపూడి గ్రామంలో రెండో రోజు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముందుగా జగనన్న కాలనీలోని ఇళ్లకు తాగునీటి కుళాయిల కనెక్షన్లను, నూతనంగా ట్రాన్స్ఫార్మర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీయగా ప్రతి ఒక్కరూ సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. తరువాత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తయిన ప్రతి సచివాలయానికి అభివృద్ధి నిమిత్తం 20 లక్షల రూపాయల నిధులు ముఖ్యమంత్రి మంజూరు చేస్తున్నారన్నారు. గ్రామంలోని నాయకులు అందరి ఏకాభిప్రాయంతో ఈ నిధుల్లో ఎనిమిది లక్షలు రూపాయలను డ్రెయిన్ల నిర్మాణానికి, 12 లక్షల రూపాయలు రెండు సీసీ రోడ్లు నిర్మించేందుకు వినియోగించేలా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కేశబోయిన జానకి శ్రీనివాస్, ఉప సర్పంచి మంతెన చంటిరాజు, మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు పాల్గొన్నారు.

దళిత వాడల్లో పాఠశాలలు కొనసాగించాలి: కెవిపిఎస్

ప్రజాశక్తి - యలమంచిలి

కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శిగా మండలానికి చెందిన ఇంజేటి శ్రీనివాస్, సభ్యులుగా గొల్ల ఏడుకొండలు, బాతిరెడ్డి జార్జి ఈ నెల 15, 16 తేదీల్లో భీమవరంలో జరిగిన కెవిపిఎస్ జిల్లా మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఉమా నరసింహ కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ యలమంచిలి మండల వ్యాప్తంగా గోదావరి వెంబడి అనేక ఏళ్లుగా పెరుగులంక భూములను సాగు చేసుకుంటున్న దళితులకు ప్రభుత్వం పట్టాలను అందించాలని, దళిత వాడల్లో ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ దళిత పేటలకు మూడెకరాల శ్మశాన భూమిని ప్రభుత్వం మంజూరు చేసే విధంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భారతిరెడ్డి జార్జి, గొల్ల ఏడుకొండలు, కానేటి బాలరాజు, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి పాల్గొన్నారు.

కాలుష్య జలాలతో నాలుగేళ్లుగా సాగుకు దూరం

రొయ్యల చెరువు నీరు విడుదలపై రైతుల అభ్యంతరం

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం గ్రామ పంచాయతీ పరిధిలోని పెరికిపాలెం రహదారికి సమీపంలోని సుమారు 100 ఎకరాల్లో బంగారు పంటలు పండే భూములు నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారి కాలుష్య జలాలకు నిలయంగా తయారైంది. ఈ ప్రాంతంలో ఆక్వా చెరువులు సాగు చేయడంతో ఆ చెరువుల నుంచి వచ్చే కాలుష్య జలాలే తమ పంట భూముల పాలిట శాపంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటితో వరిచేలల్లో ఎప్పుడు మోకాళ్లలోతు నీటితో నిండిపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై నాలుగేళ్లుగా జిల్లా, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా సరైన చర్యలు తీసుకుపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై ఇటీవల మండల కమిటీ అధికారులొచ్చి పరిలించి వెళ్లిన ఇంతవరకు తమ పరిశీలన నివేదిక వివరాలను కనీసం అందించలేదని వారు చెబుతున్నారు. రొయ్యల చెరువులో నీటిని ఇంజిన్ల సాయంతో తమ భూముల్లోకి మళ్లించడాన్ని స్థానిక రైతులు శనివారం అడ్డుకున్నారు. దీనిపై మండల, జిల్లా స్థాయి అధికారులకు రైతులు చరవాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రాంతాన్ని తహాశీల్దార్ షేక్ హుస్సేన్, మత్స్యశాఖ రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఆక్వా చెరువులో నీటిని రైతుల భూముల్లోకి విడుదల చేయడంపై నివేదికను తయారు చేసి ఉన్నతగా ఉన్నతాధికారులకు పంపిస్తామని తహాశీల్దార్ తెలిపారు.

చెరువును చూపుతున్న రైతులు

పేరుపాలెం బీచ్ కళకళ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు ప్రకృతి ప్రేమికులు బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఘటన సంబంధించి వివరాలు ఎలా ఉన్నాయి. విజయవాడ రూరల్ గొల్లపూడి అంబేద్కర్ కాలనీ చెందిన యనమల అనిరుద్ (23) భీమవరంలోని ఓ ప్రముఖ కళాశాలలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అనిరుద్ భీమవరం మండలం రాయలం గ్రామం పరిధిలో కొమరాడ రోడ్డులో గది అద్దెకు తీసుకుని రోజూ కళాశాలకు వెళ్లి చదువుకునేవాడు. అయితే ఇటీవల వేరే కళాశాలకు చెందిన అమ్మాయితో స్నేహం చేయడంతో, ఇద్దర మధ్య గ్యాప్ వచ్చి దూరంగా ఉంటున్న అనిరుద్ మనస్తాపంతో ఆత్మహత్య పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటనకు సంబంధించి పోలీసులకు సమాచారం రావడంతో టూ టౌన్ సిఐ కృష్ణకుమార్, రాంబాబు ,అప్పారావు, ఘటనా స్థలం పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శనీయులు సూర్యనారాయణమూర్తి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో నిర్మాణంలో ఉన్న ప్రజా సంఘాల కార్యాలయానికి రైతు ఉద్యమ నాయకులు తాళం సూర్యనారాయణమూర్తి పేరు పెడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. శనివారం తాళం సూర్యనారాయణ మూర్తి వర్ధంతి సందర్భంగా ఉండి మెయిన్ సెంటర్లోని సిపిఎం కార్యాలయం వద్ద చీరల శేషగిరిరావు అధ్యక్షతన తాళం సూర్యనారాయణ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాళం సూర్యనారాయణ మూర్తి పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడని తెలిపారు. ఆయన చెరుకువాడ గ్రామంలోనూ, మండలంలో పార్టీని బలోపేతం చేయడంలో ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తాళం సూర్యనారాయణ పార్టీ మండల కార్యదర్శిగా, రైతు సంఘం భీమవరం డివిజన్ అధ్యక్షునిగా, జిల్లా సహాయ కార్యదర్శిగా పదవులు నిర్వహించారని గుర్తు చేశారు. ఆ సమయంలో ప్రజలకు, రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుండడంతో వారిని సమీకరించి తగు న్యాయం జరిగే వరకూ పోరాడేవారన్నారు. సిపిఎం తరపున చెరుకువాడ గ్రామ ఎంపిటిసిగా అత్యధిక మెజార్టీతో గెలిచి ప్రజా సమస్యలను మండల పరిషత్‌లో గట్టిగా వినిపించి వాటి పరిష్కారానికి కృషి చేసేవారని తెలిపారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ తాళం సూర్యనారాయణమూర్తి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను రైతు ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి సహాయ కార్యదర్శి కొత్తకోట నారాయణ, నాయకులు దండు రామలింగరాజు, వీరవల్లి మాధవరావు, కొట్టాడ వెంకటేశ్వరరావు, నిమ్మితి కిషోర్, రామకూరి వెంకటరత్నం, మోపిదేవి రాము, కడలి నాగేశ్వరరావు, సావు వెంకన్న పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తికి జోహార్లు అర్పిస్తున్న సిపిఎం నేతలు

సంతకాలు సేకరిస్తున్న యుటిఎఫ్ నేతలు

సిపిఎస్ రద్దు కోరుతూ సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పోడూరు

సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిన్నూరు ఎటిఎం సెంటర్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ కన్వీనర్లు కె.దుర్గాప్రసాద్, ఆర్ఎల్ఎల్ఎన్ మూర్తి, యుటిఎఫ్ నాయకులు ఎంవి.రాజశేఖర్, జెవి.రమణ, పి.శ్రీనివాస్, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, డి.క్షేమమూర్తి, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని చినమల్లం గ్రామంలో ఎంపియుపి స్కూల్‌ను విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలకు ఇస్తున్న బియ్యం, మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, విజిలెన్స్ అధికారులు శ్రీధర్ ఎస్ఐ నాగరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నివారించాలి

సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నివారించాలని సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటికే సార్వా పంట మాసూళ్లు మొదలయ్యాయని తెలిపారు. అందుకు తగ్గట్టుగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. జిల్లాలో పలు చోట్ల ఈ విషయంపై రైతులు ఆందోళన చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సన్న, చిన్నకారు, మధ్య తరగతి, కౌలు రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నింటినీ చక్కబెడతామని ప్రగల్భాలు పలుకుతున్నా, వాస్తవానికి పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు సంచులను సరఫరా చేయాలని, మద్దతు ధర ప్రతి రైతుకూ అందేలా చూడాలని పేర్కొన్నారు. అదే విధంగా రైతుల ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. గత సార్వా, దాళ్వా పంటల్లో అమ్మిన ధాన్యానికి నేటికీ కొన్ని వందల కోట్ల రూపాయలు రైతులకు అందాల్సి ఉందని పేర్కొన్నారు. వెంటనే దాళ్వాకు ఆకుమడులు వేయడానికి రైతులు సిద్ధమవుతున్న పరిస్థితిలో ధాన్యం బకాయిలను రైతులకు వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరించకపోతే సిపిఎం నేరుగా రైతులు చేస్తున్న పోరాటానికి అండగా నిలుస్తుందని ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని హెచ్చరించారు.

ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

లేసు అల్లికలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మహిళలు స్థిరపడాలని హస్తకళల శాఖ ఎడి అపర్ణలక్ష్మి సూచించారు. పేరుపాలెం బీచ్‌లో శనివారం లేసు పార్క్ మహిళలు కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో హెచ్‌పిఒ సువర్చల షెడ్ డైరెక్టర్ సుధీర్, సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్నదాత.. అవస్థల మోత..!

సాగు నుంచి విక్రయం వరకూ అన్నీ కష్టాలే - రోడ్డెక్కిన ఆక్వా రైతులు

వ్యవసాయం అంటే గతంలో ఎంతో గొప్ప.. రైతంటే అదేస్థాయిలో గౌరవం దక్కేది. అయితే పాలకుల అస్తవ్యస్త విధానాలు, ప్రకృతి కన్నెర్ర కారణంగా వ్యవసాయ అంటేనే విముఖత చూపడంతోపాటు రైతుకు రోజురోజుకీ సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఫలితంగా జిల్లాలో రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించింది.

సార్వా వరి పంట మాసూళ్లు ముమ్మురంగా సాగుతున్నాయి. వరి కోతలు ప్రారంభమై సుమారు నెల రోజులైంది. గత 20 రోజులుగా మాసూళ్లు పెద్దఎత్తున సాగుతున్నాయి. అయితే ఏటా మాదిరిగానే ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిం చడంలో విఫలమైంది. మాసూళ్లు 50 శాతం దాటినా ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభ దశలోనే ఉండడం గమనార్హం. ఆర్‌బికెల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల ప్రారంభంలో ఆలస్యంతో ఇప్పటికే రైతులు నానావస్థలు పడుతున్నారు. కొంతమంది రైతులు తమ పేరిట కొనుగోలు కేంద్రాలకు తోలుకోండంటూ దళారులకు ధాన్యం అమ్మేసిన ఘటనలూ ఉన్నాయి. ఎట్టకేలకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై అక్కడకు ధాన్యం తీసుకెళ్లిన రైతులకు సవాలక్ష సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. తేమశాతం నిబంధన రైతులకు ఇబ్బందికరంగా మారింది. అయినప్పటికీ నానావస్థలు పడి ధాన్యం ఆరబెట్టి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే అక్కడ ఆన్‌లైన్ సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. దీంతో ఆర్‌బికెల వద్ద ధాన్యం లోడులతో రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. దాని ఫలితమే తణుకు మండలం దువ్వలో రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడం. రైతులు ఆత్మహత్యాయత్నానికి సైతం సిద్ధమయ్యారంటే ఎంత విసిగివేసారి పోయారో అర్థం చేసుకోవచ్చు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఇలాకాలోనే ఈ పరిస్థితి నెలకొనడంతో మంత్రి జోక్యం చేసుకుని ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి ధాన్యం మిల్లులకు తరలించాలని ఆదేశించడంతో కొంత సమస్య పరిష్కారమైంది. అయితే మిగిలిన ప్రాంతాల రైతుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగానే మిగిలింది. అదే సమయంలో రైతులను గోనె సంచుల సమస్య వెంటాడుతోంది. దిగుబడికి అనుగుణంగా రైతులకు అవసరమైన గోనె సంచులు ఇవ్వకుండా ఎకరాకు కేవలం 60 సారలకు సంబంధించి సంచులే ఇవ్వడంతో మిగిలిన ధాన్యాన్ని ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. హమాలీల ఛార్జీ, రవాణా ఛార్జీలు ఎప్పటికొస్తాయో అర్థం కావడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. మొత్తంగా అష్టకష్టాలు పడి ధాన్యం పండించిన రైతుకు ఆ పంట అమ్ముకునే సమయంలోనూ ప్రభుత్వ విధానాలతో తిప్పలు తప్పడం లేదని ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి రైతులకు అనుకూల విధానాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆక్వా రైతులు రొయ్యలు వంద కౌంట్‌కు కనీసంగా రూ.240 తగ్గకుండా ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రమైన ఉండిలో పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. సమస్యను పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత ఇటు అధికారులు, అటు ప్రజా ప్రతినిధులపై ఉంది. అయితే దానికి భిన్నంగా అధికార, ప్రతి పక్షాలు ఒకరిపై ఒకరు విమర్శలకు దిగడం గమనార్హం. మొత్తంగా ఆక్వా రైతు సమస్య మాత్రం అపరిష్కృతంగానే మిగిలిపోతుంది. కారణాలేవైనా ఎగుమతులు తగ్గిన మాట వాస్తవం. అయితే ఆ పేరుతో ధర తగ్గించి కొనడం మన రొయ్య వ్యాపారులకు చాలాకాలంగా ఒక అలవాటుగా మారింది. దీనిపై ప్రభుత్వ పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడమే కారణం. ఇప్పటికైనా ప్రభుత్వం రంగంలోకి దిగి కచ్చితంగా ప్రభుత్వం ప్రకటించిన ధర అయినా రైతుకు దక్కేలా కఠిన చర్యలు చేపట్టాల్సి ఉంది. లేనిపక్షంలో అటు వరి రైతులు, ఇటు ఆక్వా రైతులు సాగుకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

– వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.నరసింహ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఎల్‌బి.చర్ల హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నరసింహ మాట్లాడుతూ నాడు - నేడుతో పాఠశాలలకు రంగులు వేసి, భవనాలు నిర్మిస్తే చాలదని, విద్యార్థులకు చదువు చెప్పాలంటే పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటికీ ప్రభుత్వం ఎందుకు పోస్టులు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.మురళి, గణేష్ పాల్గొన్నారు.

కోపల్లెలో సొసైటీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ వేగేశ్న జయరామకృష్ణంరాజు

సహకార సంఘాలతోనే రైతుల అభివృద్ధి

సొసైటీ ఛైర్మన్ వేగేశ్న జయ రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

సహకార సంఘాల ద్వారా రైతుల అభివృద్ధి సాధ్యమని సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ వేగేశ్న జయరామకృష్ణంరాజు అన్నారు. సహకార సంఘ వారోత్సవాల్లో భాగంగా కోపల్లె సొసైటీ ఛైర్మన్ వేగేశ్న జయరామకృష్ణంరాజు అధ్యక్షతన 69వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సహకార సంఘం సహకార శాఖ ఉద్యోగులకు, రైతులకు సహకార వారోత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులకు విశిష్టసేవలు అందిస్తున్నామన్నారు. సహకార రంగంలో వచ్చిన మార్పులు, వ్యాపార అవకాశాలు ఉపయోగించుకొని సభ్యులకు, ప్రజలకు కావాల్సిన సేవలందించేందుకు సమిష్టిగా కృషి చేస్తున్నామన్నారు. సహకార సంఘం కేవలం రుణాలు ఇవ్వడమే కాకుండా ఇతర వ్యాపారాల ద్వారా ఆదాయాలు పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ జంపన సాయి గీత, అసిస్టెంట్ సిఇఒ వెంకటేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పలు ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. లంకలకోడేరు, వెంకటాపురం, రాజులపాలెంలో సార్వాకు సంబంధించి మాసూళ్లు చాలా వరకూ పూర్తయ్యాయి. రాజులపాలెంకు చెందిన రైతు మంతెన ధర్మరాజు ఎకరాకు 25 నుండి 30 బస్తాలు దిగుబడి వస్తుందని, వాతావరణం కూడా అనుకూలించడం వల్ల ఏ ఇబ్బంది లేకుండా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ గుబ్బల నరేష్ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ధాన్యం ట్రాన్స్‌పోర్టు నిమిత్తం టన్నుకు 324 రూపాయలు, ధాన్యం బస్తాలు ఎగుమతికి సంబంధించి జట్టు కూలి 25 రూపాయలు, బస్తాకు మద్దతు ధర 1,530 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆ మొత్తాలను రైతు ఖాతాకు జమ చేస్తారని చెప్పారు.

వడ్డిగూడెం కూలీలకు స్వల్పగాయాలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన పలువురు కూలీలు కడప జిల్లా ప్రొద్దుటూరులో చేపలు చెరువు వద్ద కూలీ పని నిమిత్తం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై ఎనిమిది మంది స్వల్ప గాయాలయ్యాయి. వివరాల ప్రకారం. ఈ నెల 16వ తేదీన వడ్డిగూడెం గ్రామానికి చెందిన కూలీలు బొలేరో వాహనంలో ప్రొద్దుటూరు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని 18వ తేదీ రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. కూలీల వాహనం కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం పాచ్చాపురం వచ్చేసరికి వాహనం బోల్తా పడడంలో అందులో ప్రయాణిస్తున్న కూలీలు స్వల్పంగా గాయపడ్డారు. వాహనం నడుపుతున్న డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. వాహనంలో మొత్తం పన్నెండు మంది కూలీలు ఉండగా అందులో ఎనిమిది మందికి స్వల్ప గాయాలైనట్టు గ్రామ సర్పంచి సైదు శ్రీనివాసరావు తెలిపారు. బాధితులను మచిలీపట్నంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ సహకారంతో వారిని భీమవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

శిశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేయిస్తున్న సర్పంచి కృష్ణ

చిన్నారులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - ఉండి

చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వాండ్రం గ్రామ సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు దాసరి వెంకటకృష్ణ అన్నారు. శనివారం వాండ్రం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో శిశువులకు వ్యాధి నిరోధకటేకాల కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దాసరి కృష్ణ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి నెల 15 రోజుల నిండిన శిశువుల వరకు వ్యాధి నిరోధక టీకాలను ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా సకాలంలో వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.సోమన్న, ఎఎన్ఎం ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న మాచేనమ్మ ఆలయ పాలకవర్గ సభ్యులు

మాచేనమ్మ ఆలయ ఛైర్మన్‌గా పెద్దిరాజు

ప్రజాశక్తి - ఆచంట

పెదమల్లం మాచేనమ్మ - పల్లాలమ్మ దేవస్థానం పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. మాచేనమ్మ ఆలయ ఛైర్మన్‌గా సూర్నేది పెద్దిరాజు, పాలకవర్గ సభ్యులుగా ఎనిమిది మంది ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు నరసింహరాజు (నరేష్) హాజరయ్యారు.

కైలాస రథం ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన కైలాస రథాన్ని డాక్టర్ సంజయ్, సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాత అద్దంకి నారాయణ ముత్యావల్లి దంపతులు ఈ కైలాస రథాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు.

గ్రామాభివృద్ధికి కృషి

లక్ష్మీనరింహపురం సర్పంచి తానింకి నాగరాజు

సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచి, ఉప సర్పంచి, ఎంపిటిసి

ప్రజాశక్తి - కాళ్ల

లక్ష్మీనరసింహపురంలో ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకొని పలు అభివృద్ధి పనులు చేపట్టి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నానని గ్రామ సర్పంచి తానింకి నాగరాజు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామమైన లక్ష్మీనరసింహపురంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలందరూ మెచ్చుకునే రీతిలో పార్టీలకు అతీతంగా పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. బడుగు, బలహీనవర్గాలకు పంచాయతీలోని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో తాగునీరు, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో తాగునీరు, డ్రెయినేజీ, రోడ్ల సమస్యల పరిష్కారానికి దశలవారీగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడానికి కృషి చేస్తానన్నారు. లక్ష్మీనరసింహపురంలో ఇప్పటివరకూ సుమారు కోటిన్నర రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఇచ్చిన మాట ప్రకారం సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.20 నిధులు మంజూరు చేయడంతోపాటు శంకుస్థాపన పనులు చేపట్టి నిర్మాణ పనులు సరిగ్గా చేస్తున్నామన్నారు. జెడ్‌పిటిసి నిధులు రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌సి ఏరియాలో ఎనిమిది సిమెంట్ రోడ్ల పనులు చేస్తున్నామన్నారు. లక్ష్మీనరసింహపురంలో సచివాలయ భవన నిర్మాణ పనులు రూ.37.50 లక్షలతో, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ పనులు రూ.28.50 లక్షలతో, హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు రూ.17.50 లక్షలతో జరుగుతున్నాయన్నారు. గ్రామంలో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించామన్నారు. ఫిల్టర్‌బెడ్ మరమ్మతులు, ఓవర్ హెడ్ ట్యాంక్ మరమ్మతులు రూ.నాలుగు లక్షలతో చేపట్టామన్నారు. తాగునీటి చెరువు విస్తరణ పనులు సుమారు రూ.ఆరు లక్షలతో చేపట్టామన్నారు. 80 సెంట్ల చెరువును విస్తరణ చేయడం వల్ల నీటి నిల్వలు పెరిగాయన్నారు. లక్ష రూపాయలతో కచ్చా డ్రెయిన్ పనులు చేపట్టామన్నారు. 150 వీధిలైట్లు ఏర్పాటు చేశామని, 200 మందికి ఇళ్ల స్థలాల పూడిక పనులు చేపట్టి పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించామని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు.

క్షీరా రామలింగేశ్వర స్వామి సన్నిధిలో..

రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి దంపతులను శనివారం జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నాగిరెడ్డిస్వామిని దర్శించుకున్నారు. వైసిపి నేతలు చందక సత్తిబాబు, జిల్లా వ్యవసాయ అడ్వయిజరీ బోర్డు ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు చౌదరి, పాలకొల్లు మన్యం జగ్గమ్మవారి సత్రం ఛైర్మన్ నంబూరి గంగాపవన్, నిమ్మకాయల రామకృష్ణ నాగిరెడ్డిని కలుసుకున్నారు. ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు వారికి మెమెంటో అందజేశారు.

రక్త పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని పెనుమంట్ర పిహెచ్‌సి డాక్టర్ కె.లావణ్య, వై.అనూష అన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని సచివాలయాల్లో శనివారం ఫీవర్స్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేలో 12 మంది జ్వర బాధితులను గుర్తించామని తెలిపారు. వారి నుంచి రక్తనమూనాలు సేకరించి మందులు ఇవ్వడమే కాకుండా ఆరోగ్యపరమైన సూచనలు అందించామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయాలు వద్ద వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరంలో ఆక్రమణలు గుర్తించండి : డిపిఒ

ప్రజాశక్తి - వీరవాసరం

జిఒ 188 ప్రకారం గ్రామాల్లో ఆక్రమణలు గుర్తించి వాటి జాబితా పంచాయతీ కార్యాలయంలో ఉంచాలని డిపిఒ నాగలత అన్నారు. అలాగే ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలంటూ కార్యదర్శి శ్రీనివాస్‌కి సూచించారు. వీరవాసరంలో నెలకొన్న పారిశుధ్య పరిస్థితులను డిపిఒ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలు పునరావృతం కావడంతో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకొని రహదారికి ఇరువైపులా సుందరీకరించాలన్నారు. భీమవరం నుంచి పాలకొల్లు జాతీయ రహదారి వెంబడి ఒక్క వీరవాసరంలో మాత్రమే అపారిశుధ్య పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును వినియోగంలోకి తీసుకొచ్చి గ్రామంలో చెత్తను రోడ్డుపక్కన వేయకుండా షెడ్డుకు తరలించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారం చెత్త వేస్తున్న వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గొంతేరు డ్రెయిన్ వద్ద డంప్ చేస్తున్న చెత్తను డిపిఒ పరిశీలించి సర్పంచి చికిలే మంగతాయారుకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట జగనన్న స్వచ్ఛ సంకల్పం జిల్లా కో ఆర్డినేటర్ ఎడ్వర్డ్, కార్యదర్శి భూసారపు శ్రీనివాసరావు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సమస్యల పరిష్కారం కోసం భవన నిర్మాణ కార్మికులు తమసత్తా చూపాల్సిన సమయం వచ్చిందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పాలూరి లక్ష్మణరావు తెలిపారు. శనివారం స్థానిక హౌసింగ్ బోర్డులో మూడు మకాములకు చెందిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణ రావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయలేదని, రాజమండ్రిలో జరగనున్న భవననిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం భవన నిర్మాణ కార్మికులు సంఘటితం కావాలని కోరారు. ఈనెల 26న జరగనున్న ప్రదర్శన జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు, ఏరియా కమిటీ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, కోశాధికారి రాంబాబు పాల్గొన్నారు.

రైతులు మాసూళ్లు పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రస్తుతం వరి గింజ గట్టిపడే దశ నుంచి కోత దశలో ఉన్నందున రైతులు మాసూలు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ జి.జోగినాయుడు అన్నారు. సంస్థలో శనివారం నిర్వహించిన శిక్షణ, సందర్శన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి - పెనుగొండ

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తామని ఆచంట ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని మునుమర్రు, పెనుగొండలో ఉన్న జగనన్న లే అవుట్లను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని చెప్పారు. అధికారులు లబ్ధిదారులకు సహకరించాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి - నరసాపురం

నీటిని వినియోగించే ప్రతిఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని హైదరాబాద్ అకాడమిక్ స్టాఫ్ కాలేజీకి చెందిన స్టేట్ కో-ఆర్డినేటర్ అండ్ టీం లీడ్ ఉదయ్ సింగ్ గౌతం అన్నారు. వైఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ టాయిలెట్స్ డే సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతిఒక్కరూ ఇంకుడు గుంతలు తవ్వుకొని నీటిని భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.కనకారావు, కళాశాల డీన్ డాక్టర్ గంధం రామ కృష్ణ హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ అకాడ మిక్ స్టాఫ్ కాలేజీ, రీసెర్చ్ అసోసియేట్ ప్రవంతి, ఇంగ్లీష్ విభాగం అధిపతి సిహెచ్.సోమేశ్వరి, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆఫీసర్స్ వంశీ, ఎస్.యకోబ్ పాల్గొన్నారు.

శ్రీవిష్ణు కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

భీమవరం రూరల్ : స్థానిక శ్రీవిష్ణు ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ ఐదో గ్రాడ్యుయేషన్ డే విష్ణోత్సవ్ 2కె 22 ను శనివారం కళాశాల ఆవరణలోని బి.సీతా ఇండోర్ ఆడిటోరియంలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు తెలిపారు. 2018-22 బ్యాచ్‌కు చెందిన 686 మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు, 2020-22 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ఎంటెక్ విద్యార్థులకు, 53 మంది ఎంబిఎ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఐఐటీ మద్రాస్, ఐఐఎం కలకత్తా పూర్వ విద్యార్థి టిఎన్.హరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్, కెవి.విష్ణురాజు,వైస్ ఛైర్మన్ ఆర్.రవిచంద్రన్, మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరాజు,డీన్స్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా పంచాయతీ అధికారి నాగలత

ప్రజాశక్తి - పాలకోడేరు

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారని, ఈ నేపథ్యంలో పాశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత అన్నారు. పెన్నాడ గ్రామంలో జరుగుతున్న పారిశుధ్యం కార్యక్రమాలను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు ఎప్పటికప్పుడే శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు తడి, పొడి చెత్తను సక్రమంగా నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమెతో పాటు పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఉన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని గరువు గ్రామంలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కరెంట్ మీటర్ అందించారు. తొలుత రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దిశ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఉండి

దిశ యాప్ ఆపదలో ఉన్న మహిళలకు బ్రహ్మాస్త్రంగా పనిచేస్తుందని ఉండి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ యేసయ్య అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దిశయాప్‌పై అవగాహనా కార్యక్రమాన్ని గ్రంథాలయ నిర్వాహకులు జక్కంపూడి వెంకట కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ యేసయ్య మాట్లాడుతూ ప్రతి మహిళ, యువతి తన స్మార్ట్‌ఫోన్‌లో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

నరసాపురం టౌన్ :వైఎన్ కళాశాల (అటానమస్) నరసాపురం గ్రంథాలయ విభాగం వారు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం కళశాల గ్రంథాలయ అధికారి జి.కోటయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.కనకరావు, వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరత్నం, డీన్ జి.రామకృష్ణ పాల్గొన్నారు.

రేపటి నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో ధాన్యం కొనుగోలును సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ఉన్న 17 సచివాలయాల పరిధిలోని 17 రైతు భరోసా కేంద్రాల్లోనూ కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కేంద్రాల్లో రైతులు తమ పేర్లు నమోదు చేయించుకుని అనంతరం తమ ధాన్యాన్ని సైతం నమోదు చేయించుకుని వారికి కేటాయించిన మిల్లులకు ఆ ధాన్యాన్ని చేరవేయాల్సి ఉంటుందని చెప్పారు. ధాన్యం ప్రభుత్వానికి విక్రయించడం వల్ల రైతుకు అధిక లాభం వస్తుందని ఆయన తెలిపారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి 'మాంటిస్సోరి'

ప్రజాశక్తి- తణుకు

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానిక మాంటిస్సోరి స్కూల్ స్థానం సంపాదించిందని ఆ స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాష్‌రావు తెలిపారు. దీపావళి సంబరాల్లో భాగంగా 2600 మంది విద్యార్థులు వివిధ ఆకృతులలో ఉన్న మట్టి ప్రమిదలకు రంగులతో డిజైన్లు వేసి వాటిని 20 అడుగుల పొడవు 20 అడుగుల వెడల్పుతో పాఠశాల చిహ్నం కమనీయ ఆకృతిగా అలంకరించి ప్రదర్శించిన కళాకాండమునకు రికార్డ్స్‌లో స్థానం లభించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ప్రశంసాపత్రం జ్ఞాపిక అందించారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపు తనిఖీ

అత్తిలి :మండలంలోని మంచిలి, బల్లిపాడు సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక క్యాంపును ఎంపిడిఒ వివివిఎస్.రామారావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆధార్ ప్రత్యేక కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పదేళ్ల క్రితం ఆధార్ కార్డ్ పొందినవారు వారి డేటాను అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

నేరాలు - ఘోరాలు

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - మొగల్తూరు

హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... మొగల్తూరు గ్రామానికి చెందిన నంగల లక్ష్మి(42) భర్త గతంలో మృతి చెందాడు. ఆమె కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో లక్ష్మి నరసాపురం గ్రామీణ మండలం చిట్టవరానికి చెందిన నక్క పోతురాజు ఎనిమిది సంవత్సరాలుగా సహజీవనం చేస్తుంది. వీరు మొగల్తూరులోని ఆదర్శనగర్ కాలనీలో ఉంటున్నారు. పోతురాజు కొంతకాలం నుంచి మద్యానికి బానిస అయ్యాడు. దీంతో తరచూ డబ్బుల కోసం లక్ష్మిని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని పోతురాజు డబ్బులు అడగగా లక్ష్మి ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన పోతురాజు విచక్షణారహితంగా ఆమెను కొట్టాడు. తలను గోడకేసి కొట్టడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి అత్యవసర వాహనంలో తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. దీనిపై లక్ష్మి కుమారుడు ఏసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సిఐ వాడపల్లి సురేష్ బాబు సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు పోతురాజును అరెస్ట్ చేశామని ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

పేకాట స్థావరాలపై పోలీసులు మెరుపు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసిన సంఘటన మండలంలోని యండగండి గ్రామంలో చోటు చేసుకుంది. ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం.. యండగండి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పేకాట స్థావరాలపై దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,55,220 నగదు, ఎనిమిది సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు.

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాజా రాక

ప్రజాశక్తి- భీమవరం

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా ఈ నెల 20న భీమవరం రానున్నారు. ఈ మేరకు శనివారం జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు రాజమండ్రి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి సాయంత్రం ఐదున్నర గంటలకు భీమవరం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ చేరుకుని రాత్రి బస చేస్తారు. 21వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు భీమవరం నుండి రోడ్డు మార్గాన బయలుదేరి 9 గంటలకు నరసాపురం చేరుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు నరసాపురం నుండి రోడ్డు మార్గాన్ని బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు భీమవరం చేరుకుంటారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం సాయంత్రం 6 గంటలకు భీమవరం నుండి బయలుదేరి తుని వెళతారు.

చంద్రబాబు తీరు సరికాదు : పివిఎల్

కాళ్ల:మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానుల ప్రణాళికలతో అభివృద్ధివైపు అడుగులేస్తుంటే టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అడ్డుకుంటున్నారని, ఆయన తీరు సరికాదని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరంలో వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో చివరి రోజు పర్యటిస్తున్న టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడును న్యాయవాదులు, విద్యార్థి సంఘాల జెఎసి నేతలు తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారన్నారు. న్యాయరాజధానికి అడ్డుపడే చంద్రబాబునాయుడును రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ప్రజలు ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్లు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెనుమత్స ప్రసాదరాజు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

గౌరవనీయులైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వారి కోర్టులో

A.S.S.R.No. 1756/2015 in
I.A.No. 296/2021 in
I.A.No. 436/2021

బిట్వీన్:
జిల్లెళ్ళమూడి నరశింహారావు ...**అప్పిలెంటు**
మరియు
వాడపల్లి నాగమణి ...**రెస్పాండెంటు**

పై దావాలో మీరు ప్రతివాదులయిన వున్నందు గౌరవనీయులైన జిల్లా కోర్టు ద్వారా మీకు కోర్టు వారి సమన్లు జారీ చేసియున్ననూ, మీరు హాజరు కాకపోవుట వలన మీకు పత్రికా ముఖమున తెలియజేయునది **ది.21-11-2022వ తేదీ సోమవారం ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని గౌరవనీయులైన జిల్లా జడ్జి వారి కోర్టులో హాజరయ్యి** మీ వాదనను దాఖలు తెలియచేయని ఎడల పై దావాను ఏకపక్షంగా నిర్ణయించెదరని తెలియజేయడమైనది.

జిల్లెళ్ళమూడి ఎం.వి.వి.ప్రసాదరావు
జల్లెళ్ళమూడి వారి వీధి, తూర్పు వీధి,
ఏలూరు. సెల్: 86883 49448

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : TANUKU
E.A.No. 87/2019 in
E.P.No. 82/2017 in
O.S.No. 76/2007

Between:
Plaintiff /D.Hr: Arava Seetha Devi
మరియు
Defendant /J.Dr:
Bejjavarapu Mutyala Satyanarayana

వాది తరపున వేయించిన ప్రకటన

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు గ్రంథంలో ప్రతివాది /జె.డి.ఆర్ బెజ్జవరపు ముత్యాల సత్యనారాయణ, తండ్రి: రాములు, డో.నెం. 10-19-17రు, 8వ వార్డు, బెజ్జవరపు వారి వీధి, పాతవూరు, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా అయిన మీకు కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా దావా సమన్లు పంపిననూ అమలుకాని కారణంగా ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టు వారి ఎదుట **ది.30-11-2022 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసు కొనవలసినదిగాను,** అట్లు కానిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

K.S.VENKATESWARLU
Advocate for Petitioner /Plaintiff,
Tanuku, Tanuku.
14-11-22. Cell: 91333 91921

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప॥గో॥జిల్లా

M.V.O.P.No. 46/2019

బిట్వీన్:
మల్లుల కిషోర్ ...*పిటీషనర్*
అండ్
కొల్లాటి వెంకటేశ్వరరావు & Others ...*రెస్పాండెంట్లు*

టు: ఆర్-6:
కొల్లాటి నాగలక్ష్మి, భర్త: లేటు వెంకటేశ్వరరావు @ వెంకటేష్, R/o. వేములదీవి గ్రామం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి.నెం. 46/2019లో పై తెలిపిన 6వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తరవు ప్రకారం మీరు **డిసెంబరు నెల 9వ తేదీ 2022వ సం॥రం ఉదయం 10:30 ని॥లకు హాజరు కావలెను.** లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 09-12-2022

నిమ్మల వీరవెంకట సత్యనారాయణ
సెల్: 98482 13165
నిమ్మల నవీన్
సెల్: 897812 2722
అడ్వకేట్స్, భీమవరం.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814